RNI NO : TELTEL/2023/88524

# మెదక్ టుడే

దిన పత్రిక




ఎడిటర్ : సిహెచ్. శివకుమార్ సంపుటి : 04 సంచిక : 184
గురువారం, జూన్ 18, 2026 , పేజీలు - 4 వెల : 2/-

# తెలంగాణ భవిష్యత్

## పునర్నిర్మాణం తరగతి గదుల్లోనే ఉంది

- ప్రభుత్వ పాఠశాలల ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తాం
- ఇక్కడ మంచి నాయకత్వ లక్షణాలు ఉంటాయన్న రేవంత్
- ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా :** విద్యారంగంలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలుపుతామని సీఎం రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. తెలంగాణ రాష్ట్రంలో 24 వేల ప్రభుత్వ పాఠశాలలు ఉంటే అందులో 27 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. వారందరికి ఈ ఆరుట్ల గ్రామంలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను అంకితం ఇస్తున్నట్లు ప్రకటించారు. అంతకుముందు రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అక్కడికి హెలికాప్టర్‌లో చేరుకున్న సీఎం తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో మొదటగా పైలాన్‌ను ఆవిష్కరించా రు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. వారితో ముచ్చటించారు.విద్యపై చేసేది పెట్టుబడి : ప్రభుత్వ పాఠశాలల్లోని 27 లక్షల మంది విద్యార్థులకు ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ గొప్ప స్ఫూర్తినిస్తుందని విశ్వసిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ భవిష్యత్ పునర్నిర్మాణం అద్దాల మేడల్లో, రంగుల గోడల్లోనో లేదని తరగతి గదుల్లో మాత్రమే ఉందన్నారు. ఈరోజు విద్యపై చేసేది ఖర్చు కాదని భవిష్యత్? పెట్టుబడి అని పేర్కొన్నారు. విద్యాశాఖపై ప్రజాప్రభుత్వం రూ.27 వేల కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడించారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యపై ఇప్పటికీ కొంతమంది తల్లిదండ్రులకు అపోహలు ఉన్నాయన్న సీఎం వాటిని తొలగించేందుకే టీపీఎస్ నిర్మాణాన్ని చేపట్టినట్లు వివరించారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకే విద్యా కమిషన్ వేశామన్న ఆయన విద్య మాత్రమే మన జీవితాలను సమూలంగా మార్చగలదని అన్నారు. సమాజంలో అసమానతలు పోవాలంటే అందరికీ నాణ్యమైన విద్య అవసరమని నొక్కి చెప్పారు.నామోషీ అనే ఆలోచన పోవాలి : ఆరుట్ల ప్రభుత్వ పాఠశాలను పైలెట్ ప్రాజెక్టు కింద మోడల్?గా తీసుకుని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా పునర్నించినట్లు సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆరుట్ల గ్రామం తెలంగాణకే ఆదర్శం, స్ఫూర్తి అని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తామని, విద్యార్థుల్లో మంచి నాయకత్వ లక్షణాలు ఉంటాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ అనే ఆలోచన పోవాలని, ఐఏఎస్, ఐపీఎస్, సీఎం అయినవాళ్లు కూడా ప్రభుత్వ బడుల్లో చదివిన వారున్నారని తెలిపారు. గత ప్రభుత్వం వర్గానికొక స్కూల్ పెట్టి కుల వ్యవస్థను ప్రోత్సహించిందని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అంటూ కులానికొక స్కూల్ పెట్టారని ధ్వజమెత్తారు. కుల వ్యవస్థను నిర్మూలించేందుకే తాము ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామన్న ఆయన త్వరలోనే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభిస్తామన్నారు. ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీని హైదరాబాద్‌కు తీసుకొస్తే తనపై కొంత మంది విమర్శలు చేశారని సీఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకే మెస్సీని తీసుకువ చ్చామన్న ఆయన మెస్సీ డ్రగ్స్ ముఠా లీడర్ కాదు, ఆర్థిక నేరగాడు కాదని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. గత ప్రభుత్వం యూ నిఫామ్‌లు ఇస్తే నెల రోజులకే చిరిగేవన్న ఆయన కాంగ్రెస్ ప్రభు త్వం నాణ్యమైన వస్తువులతో విద్యా కిట్ ఇస్తోందని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లు రెండో విడతలో వారికే


# తొలి ప్రాధాన్యం



**హైదరాబాద్, జూన్17:** ఇందిరమ్మ ఇళ్లు రెండో విడతలో గుడిసె వాసులకే తొలి ప్రాధాన్యం ఇస్తామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లపై గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా గుడిసెల గుర్తింపునకు ప్రత్యేక సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. 75 వేల గుడిసెల దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన చేస్తామ న్నారు. అర్హుల ఎంపిక పూర్తి పారదర్శకతతో చేపడతామని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేయని గుడిసె వాసులకు మరో అవ కాశం ఇస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటిం చారు. రెండో విడతలో 2.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడతామని వివరించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 2 వేల ఇళ్లు నిర్మిస్తామని వెల్లడించారు. అలాగే రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రతి నియోజకవర్గా నికి 500 ఇళ్లు నిర్మిస్తామని.. తద్వారా రాష్ట్రవ్యా ప్తంగా 50 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరు తుందని పేర్కొన్నారు.ప్రమాదకర ఇంటి పైకప్పు ల మార్పునకు రూ. 2 లక్షల వరకు సాయం అందిస్తామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. అసంపూర్తిగా వదిలిన ఇళ్లను కూడా ఈ పథకంలో ప్రభుత్వం చేర్చనుందన్నారు. లబ్ధిదారుడే ఇంటి నిర్మాణదారడని తెలిపారు. బీఎల్‌సీ విధానంలో నిర్మాణాలు చేపడతామని పేర్కొన్నారు. పట్టణాల్లో అవసరమైతే జీ౦1 నిర్మాణాలకు అనుమతి ఇస్తామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి వివరించారు.

తెలంగాణలో మేలుజాతి వంగడాల సాగుకు

# ప్రోత్సాహం కల్పిస్తాం



**హైదరాబాద్, జూన్ 17 :** రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. లాభదాయక వ్యవసాయం వైపు తెలంగాణ అడుగులు వేయాలని సూచించారు. పేదలు సన్నబియ్య ం తినా లని. రైతులు ఆర్థికంగా ఎదగా లని ఆకాంక్షించారు. సచివా లయంలో భట్టివిక్రమార్క అధ్యక్షత న (బుధవారం) కేబినెట్ సబ్ కమి టీ సమావేశం అయింది. ఈ భేటీకి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోళ్లు, నిల్వ సదుపాయాలపై ఈ సమీక్షలో చర్చించామని తెలిపారు.ఆ పంటలకు ప్రాధాన్యం ఇస్తాం..నాణ్యమైన వరి రకాల సాగుకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తామని మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. 5204, తెలంగాణ సోనామసూరి, -1638, జై శ్రీరామ్, రకాలపై ఫోకస్ పెట్టామని వివరించారు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ ఉన్న పంటలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పుకొచ్చారు. బాయిల్డ్ రైస్ కొనుగోళ్లు నిలిపివేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర విధానాలతో తెలంగాణ రైతాంగం నష్టపోతోందని భట్టి విక్రమార్క విమర్శించారు. గ్రామగ్రామాన రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని రైతు కమిషన్ తెలిపింది. మేలుజాతి వంగడాలతో రైతుల ఆదాయం పెరుగుతుందని వ్యవసాయ కమిషన్ సూచించింది. రాబోయే సీజన్లలో నాణ్యమైన వరి రకాల సాగు విస్తరణ లక్ష్యమని పేర్కొంది. ఎఫ్‌సీఐ కొనుగోళ్లు తగ్గించడంతో రైతులకు ఇబ్బందిగా మారిందని వ్యవసాయ కమిషన్ అభిప్రాయపడింది.

## డీల్ నాకు నచ్చకపోతే మళ్లీ బాంబులు వేస్తాం




**ఇరాన్:** ఇరాన్‌తో డీల్ తనకు నచ్చకపోయి నా ఆ దేశం పద్ధతిగా ప్రవర్తించకపోయినా మళ్లీ బాంబులు వేస్తామని అమెరికా అధ్య క్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఇరా న్‌తో కుదిరిన ఒప్పందం పూర్తిగా ఖరా రైందా అని మీడియా ప్రశ్నించగా అది తుది ఒప్పందం కాదని ట్రంప్ చెప్పారు. అది కేవ లం ఒక ప్రాథమిక అవగాహనా ఒప్పందం మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. ఇదే క్రమంలో ఇరాన్‌తో కుదుర్చుకున్న అవగా హన ఒప్పందం చాలా శక్తిమంతమైందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఆ ఒప్పందం గురించి ఎవరికీ ఎక్కువగా తెలియదని, దాని వల్ల అంతర్జాతీయ మార్కెట్లు మాత్రం జోష్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.

హనుమకొండలో అభిమానిని పరామర్శించిన పవన్ కల్యాణ్

# చల్లగా ఉండాలంటూ ప్రేమతో డైరీలో నోట్



**హనుమకొండ:** ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పర్యటించారు. హనుమకొండ హనుమాన్‌నగర్‌లోని జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న నిరంజన్ (17) అనే అభిమాని ఇంటికెళ్లి పవన్ పరామర్శించారు. కదల్లేని స్థితిలో మంచానికే పరిమితమైన నిరంజన్‌ను ఆప్యాయంగా పలకరించారు. తల్లిదండ్రులు పొనుగోటి రాంగోపాల్–మానసతో మాట్లాడి నిరంజన్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ క్రమంలో వైద్యం ఎక్కడ చేయిస్తున్నారు నిరంజన్‌ను కాపాడుకోవడానికి ఏం ఏం అవకాశాలు ఉన్నాయన్న విషయంపై ఆరా తీశారు. భగవంతుడి ఆశీస్సులు బాబుకి ఎల్లప్పుడు ఉంటాయని కుటుంబ సభ్యుల్లో మనో ధైర్యం నింపారు. వైద్య ఖర్చుల నిమిత్తం బాలుడికి రూ. లక్ష ఆర్థిక సాయం అందించారు.వెంకటేశ్వరస్వామి తీర్థ ప్రసాదాలు : తిరుమల వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి తెప్పించిన వస్త్రాన్ని నిరంజన్‌కు పవన్‌కల్యాణ్ కప్పారు. దేవుడి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. అలాగే నిరంజన్ ఆరోగ్యంగా ఉన్న సమయంలో పవన్‌కల్యాణ్‌ను అనుకరిస్తూ వేసిన డ్యాన్సు వీడియోలను చూశారు. భద్రకాళి అమ్మవారి ఆలయంలో నిరంజన్? ఆరోగ్యం కోసం ప్రత్యేక పూజలు చేయిస్తానని తెలిపారు. అలాగే భద్రకాళి అమ్మవారి ప్రతిమతో పూజలు జరిపి కుటుంబ సభ్యులకు అందజేస్తానని తెలిపారు.బాలుడికి ప్రేమతో పవన్ లేఖ : బాలుడిని పరామర్శించిన పవన్? అతనికి చిరకాలం గుర్తుండిపోయేలా ఓ నోట్? రాశారు. "ప్రియమైన నిరంజన్‌కు ప్రేమతో.. దుర్గామాత ఆశీస్సులతో చల్లగా ఉండాలని కోరుకుంటున్నా" అని డైరీలో పవన్ కల్యాణ్ రాసి ఇచ్చారు.కుటుంబానికి జీవనోపాధి : తల్లిదండ్రుల జీవనోపాధి గురించి అడిగి తెలుసుకున్నారు. నిరంజన్ తండ్రి గతంలో కాకతీయ ఆసుపత్రి క్యాంటిన్‌లో పని చేసేవారని చెప్పారు. అలా వారి జీవనోపాధి మరింత మెరుగుపర్చేందుకు క్యాంటిన్ పెట్టించాలని తెలంగాణ జనసన నాయకులకి పవన్ తెలియజేస్తానన్నారు. అలాగే బాలుడిని పరామర్శిస్తున్న క్రమంలో అతను పవన్‌కల్యాణ్‌కు కుక్కపిల్ల బొమ్మను చూపి పెంచుకోవాలనిపిస్తుందని తెలిపారు. దీంతో కుక్కపిల్లను కొని పంపుతానని హామీ ఇచ్చారు. దానిని పెంచుకోవడానికి స్వయంగా ఆ ఇంటి యజమానితో మాట్లాడి అనుమతి ఇప్పించారు.

కాంగ్రెస్ మార్క్ మోసం

# ప్రజలకు అర్థమైంది




**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాలు మరియు రాష్ట్ర ప్రయో జనాలకు సంబంధించిన రెండు కీలక అంశా లపై హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒకవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ను, ముఖ్యంగా రైతాంగాన్ని ఎలా మోసం చేసిం దో ఎండగడుతూనే.. మరో వైపు తెలంగాణ సరి హద్దు గ్రామాలను ముంచె త్తుతున్న పోలవరం బ్యాక్‌వాటర్ ముంపు సమ స్యపై బీఆర్ఎస్ సాధి,ంచిన అధికారిక విజయా న్ని ఆయన ప్రజల ముందుకు తెచ్చారు. కార్యకర్తల సమావే శంలో హరీష్ రావు మాట్లాడుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తా రు.హామీల మాయాజాలం: "గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో బాగా పనిచేసినప్ప టికీ, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అడ్డగోలు హామీలను ప్రజలు నమ్మారు. కేసీఆర్ కంటే ఎక్కువ ఇస్తామన్న రేవంత్ రెడ్డి మాటలు నమ్మి ఓటేశా రు. కానీ తీరా అధికారంలోకి వచ్చాక రేవంత్ రెడ్డి అందరినీ మోసం చేశారని ఇప్పుడు తెలంగాణ ప్రజలకు స్పష్టంగా అర్థమైంది" అని హరీష్ రావు అన్నారు.రైతుల ఆవేదన: బీఆర్ఎస్‌ను ఓడించి ఎంత పెద్ద పొరపాటు చేశామోనని నేడు రాష్ట్రంలోని రైతులు తీవ్రంగా కుమిలిపోతున్నారని, ప్రతి ఒక్కరికీ ఇప్పుడు కేసీఆర్ పాలనే గుర్తుకొస్తో ందని ఆయన పేర్కొ న్నారు.కార్యకర్తలకు అలర్ట్: సోషల్ మీడియా ఇన్ఫర్మేషన్ వార్ఫేర్ అప్రమత్తంగా ఉండి ప్రభుత్వ వైఫల్యా లను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. క్లిష్ట సమయంలో కార్యకర్తలు సరిగా పనిచే యకపోతే, మనల్ని ఇంతలా ఆదరించిన తల్లిలాంటి పార్టీకి మోసం చేసినట్టేనని హరీష్ రావు హెచ్చరించారు.

దొంగను పట్టుకునే బదులు బాధితుడి ఇంటికి

# తాళం వేస్తున్నారు



ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్ బ్యాన్‌పై ప్రభుత్వ తీరును కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా తప్పుబట్టారు. దొంగను పట్టు కునే బదులు బాధితుడి ఇంటికి తాళం వేయ డం లాంటి కొత్త ట్రిక్ అని ఎద్దేవా చేశారు. అయితే, లక్షలాది మంది విద్యార్థులు ఏళ్లుగా టెలిగ్రామ్‌లో చదువుకుంటున్నారని, ఆ సౌకర్యా న్ని లాక్కోవడం పేపర్ లీకేజీలకు పరిష్కారం ఎలా అవుతుందని ప్రశ్నించారు. దేశంలో పదేపదే పేపర్ లీక్‌లకు పాల్పడుతున్న నిందితు లపై చర్యలు తీసుకోవడంలో మోదీ యంత్రాం గం విఫలమైందన్నారు.అయితే, టెలిగ్రామ్‌పై బ్యాన్ అనేది లీకులు అరికట్టడానికి పకడ్బందీ పరిష్కారంకాదని, ఈ విషయం విద్యార్థులకు, లీకు చేసేవాళ్లకు కూడా తెలుసని రాహుల్? పేర్కొన్నారు. ఇక, తదుపరి బ్యాన్ వాట్సాప్‌పై ఉంటుందా? అని నిలదీశారు. ఈ నాటకాలు కట్టిపెట్టి విద్యార్థులపై కాకుండా, లీకేజీ మాఫియాపై దాడి చేయాలని ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ సూచించారు. విద్యార్థుల ఆవేదనను వినకపోతే తమ హక్కులను ఎలా సాధించుకోవాలో దేశ యువతకు తెలుసని హెచ్చరించారు. ఎక్స్? వేదికగా రాహుల్? ఈ మేరకు వ్యాఖ్యానించారు.

తెలంగాణలో సంక్షేమం లేదు.. ఎక్కడ చూసినా

# కూల్చివేతలే



**ఖమ్మం జిల్లా, జూన్ 17:** ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటించారు. పాలేరు నియోజకవర్గం వెంకటగిరిలో కార్యకర్తల శిక్షణా కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రాణాలకు తెగించి తెలంగాణ సాధించారని అన్నారు. కేసీఆర్ మళ్లీ రావాలని తెలంగాణ ప్రజలు కోరుతున్నారన్నారు. రాష్ట్రంలో సంక్షేమం లేదని.. ఎక్కడ చూసినా కూల్చివేత లే అని చెప్పుకొచ్చారు. తెలంగాణలో రాక్షస పాలన సాగుతోందని విమర్శించారు. దండుపా ళ్యం ముఠాకు అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అయితే ఇక్కడ మంత్రులు ఆయనను మించిపోయ రం టూ దుయ్యబట్టారు. రెవెన్యూ మంత్రి అవినీతికి హద్దు లేకుండా పోయిందని ఆరోపించారు. వ్యవసాయం సంక్షోభంలోకి పోతే పట్టించుకున్న దిక్కు లేదని కేటీఆర్ విమర్శించారు. ఆర్థిక మంత్రి కమీషన్లకు అక్రమాలకు అంతం లేదన్నారు. రాష్ట్రంలో రైతులు అష్టకష్టాలు పడు తున్నారని.. వారికి కనీసం యూరియా ఇచ్చే పరిస్థితి లేదని మాజీ మంత్రి అన్నారు. కేసీఆర్ చేసిన అప్పు.. కాళేశ్వరం, భక్తరామదాసు, తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసమని స్పష్టం చేశారు. పేద విద్యార్థుల కోసం మెడికల్ కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు.

# బీరంగూడలో ఆర్టీఏ అధికారుల మెరుపు దాడులు: నిబంధనలు పాటించని 7 స్కూల్ బస్సులు సీజ్

**పటాన్‌చెరు, జూన్ 17:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో రవాణా శాఖ అధికారులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. బీరంగూడ, అమీన్‌పూర్, పటాన్‌చెరు జాతీయ రహదారి ప్రాంతాలలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, జయప్రకాష్ రెడ్డి, గౌతమ్ నేతృత్వంలో ప్రత్యేక బృందాలు స్పెషల్ డ్రైవ్ చేపట్టాయి.

**నిబంధనల ఉల్లంఘనే కారణం:**
నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వివిధ పాఠశాలలు మరియు కళాశాలలకు చెందిన 7 బస్సులను అధికారులు సీజ్ చేశారు. ఈ మూడు రోజుల తనిఖీలలో భాగంగా మొత్తం 25 కేసులను నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

**ముఖ్యంగా తనిఖీ చేసిన అంశాలు:**
ఈ డ్రైవ్‌లో భాగంగా బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లతో పాటు, వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రధానంగా క్రింది అంశాలపై దృష్టి సారించారు:
సీటు పరిమితి: అనుమతికి మించి విద్యార్థులను ఎక్కించడం.
భద్రతా పరికరాలు: ఫస్ట్ ఎయిడ్ కిట్ మరియు అగ్నిమాపక పరికరాల లభ్యత.
డ్రైవర్ అర్హత: డ్రైవర్‌కు కనీసం 5 సంవత్సరాల అనుభవం ఉందా లేదా అన్నది పరిశీలన.
ఆయాల నియామకం: స్కూల్ బస్సుల్లో చిన్నపిల్లలను పర్యవేక్షించేందుకు తప్పనిసరిగా ఉండాల్సిన 'ఆయా'ల వివరాల తనిఖీ.

**అధికారుల హెచ్చరిక:**




రాబోయే వారం రోజుల పాటు ఉదయం మరియు సాయంత్రం వేళల్లో నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో తనిఖీలు




కొనసాగుతాయని రవాణా శాఖ అధికారులు స్పష్టం చేశారు. పాఠశాల యాజమాన్యాలు, బస్సు డ్రైవర్లు తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# నిధులు మంజూరు కై ఎమ్మెల్యేను కలిసిన పాలక వర్గం



**చేగుంట జూన్ 17, మెదక్ టుడే న్యూస్**
చేగుంట పట్టణ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని చేగుంట పాలక వర్గ సభ్యులు, ఉపసర్పంచ్ ఆధ్వర్యంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ని కోరారు.బుధవారం పట్టణ కేంద్రం లోని అలీ నివాసంలో కలిసిసమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.పట్టణ కేంద్రం ఉన్న ప్రధాన సమస్యలు మురికి కాలువలు, సిసి రోడ్లు, అండర్ డ్రైనేజీ,సులబ్ కాంప్లెక్స్,పట్టణనికి మంజూరైన రహదారి నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని పూర్తిచేయించాలని కోరారు. ప్రాధాన్యత క్రమంలో మంజూరుచేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీ, మహమ్మద్ ఆరిఫ్, రహిమోద్దీన్,రవి, వంశీ, ఉదయ్, సుకెందర్, అలీ పాల్గొన్నారు.

# తెలంగాణలో సినీ పరిశ్రమ అభివృద్ధి చెందాలి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

**-తెలుగు సినిమా షూటింగ్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి**






**చేగుంట జూన్ 17 మెదక్ టుడే న్యూస్**
చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న "సర్కార్ బాయి" తెలుగు సినిమా షూటింగ్ కార్యక్రమానికి దుబ్బాక ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా చిత్ర యూనిట్ సభ్యులు ఎమ్మెల్యే ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మూవీ షూటింగ్‌కు క్లాప్ కొట్టి అధికారికంగా ప్రారంభించారు.తెలంగాణలో సినీ పరిశ్రమ అభివృద్ధి చెందాలని, గ్రామీణ ప్రాంతాల్లో చిత్రీకరణలు నిర్వహించడం ద్వారా స్థానిక కళాకారులకు,యువతకు అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. చిత్ర బృందానికి సినిమా విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు నిర్మాత రాంరెడ్డి, డైరెక్టర్ లారా,హీరో శ్రీరామ్, హీరోయిన్ హర్షిక,సర్పంచ్ నర్సింహా, మార్కెట్ కమిటీ చైర్మన్ తాడేం వెంగళ్ రావు, వివిధ పార్టీల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, నారాయణ రెడ్డి,ఉపసర్పంచ్ స్వామి,స్థానిక ప్రజాప్రతినిధులు,బల్ చందర్, జ్ఞానేశ్వర్, హరిశంకర్,నాయకులు, వార్డ్ సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ గీతం విశ్వవిద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభం

**పటాన్ చెరు, జూన్ 17:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి వివిధ డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులలో ప్రవేశాలు జరుగుతున్నాయని, గీతం అదనపు ఉపకులపతి ఆచార్య డి.ఎస్. రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి విశ్వవిద్యాలయంలోని విద్యా విభాగాలను మరింత విస్తరిస్తూ, ప్రత్యేకంగా 'స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్'ను ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.

**కొత్త కోర్సుల ప్రవేశం:**
హైదరాబాద్ ప్రాంగణంలో ఈ ఏడాది నుంచి అనేక నూతన కోర్సులను ప్రవేశపెట్టినట్లు రావు తెలిపారు.
ఇందులో భాగంగా నాలుగేళ్ల సమగ్ర (ఇంటిగ్రేటెడ్) బి.ఎ-బి.ఇడి, బి.ఎస్సి-బి.ఇడి కోర్సులు, బి.బి.ఎ (సంస్థాపన/ఎంటర్ ప్రెన్యూర్ షిప్), బి.ఎస్సి మైక్రోబయాలజీ, ఎం.ఎస్సి బయోటెక్నాలజీ, ఎం.టెక్ రోబోటిక్స్ మరియు కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), ఎం.ఫార్మా వంటి కోర్సులను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు మరియు సామాజిక మార్పులకు అనుగుణంగా ఈ కోర్సులను రూపొందించినట్లు ఆయన వివరించారు.

**బరల్ ఎడ్యుకేషన్ విధానం:**
గీతం విశ్వవిద్యాలయం అనుసరిస్తున్న 'లిబరల్ ఎడ్యుకేషన్' విధానం ద్వారా విద్యార్థులు తమకు నచ్చిన ప్రధాన మరియు అనుబంధ అంశాలను ఎంచుకుని, తమ అభిరుచులకు తగ్గట్టుగా విద్యను అభ్యసించవచ్చని తెలిపారు. దీనివల్ల విద్యార్థులకు సబ్జెక్టులపై లోతైన పరిజ్ఞానంతో పాటు, భవిష్యత్తుకు అవసరమైన నైపుణ్యాలు అలవడతాయని పేర్కొన్నారు.

**ప్రవేశ పరీక్ష మరియు స్కాలర్ షిప్‌లు:**
విశ్వవిద్యాలయం నిర్వహించే జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష (గాట్-2026) జూన్ 28న దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ విధానంలో జరుగుతుందని, దీనికి దరఖాస్తు చేసుకోవడానికి జూన్ 26 చివరి తేదీ అని తెలిపారు. అలాగే, జాతీయ మరియు రాష్ట్ర స్థాయి ప్రవేశ పరీక్షలైన ఈ.ఎ.పి.సెట్, జె.ఇ.ఇ, సి.యు.ఇ.టి, క్యాట్ వంటి వాటి ద్వారా కూడా ప్రవేశాలు పొందవచ్చని వెల్లడించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ట్యూషన్ ఫీజు, భోజన, వసతి సౌకర్యాలలో వంద శాతం వరకు ఉపకార వేతనాలు (స్కాలర్ షిప్‌లు) అందజేస్తున్నట్లు చెప్పారు.

**విస్తృత అవకాశాలు:**
గీతం హైదరాబాద్ ప్రాంగణంలోని సాంకేతిక, శాస్త్ర, వాణిజ్య, మానవీయ, వాస్తుశిల్ప, ఔషధ, ప్రజా విధాన విభాగాల ద్వారా విద్యార్థులకు వైవిధ్యభరితమైన విద్యను అందిస్తున్నామని, 350కి పైగా ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు కలిగి ఉండటం వల్ల విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని ఆచార్య డి.ఎస్. రావు వివరించారు. మరిన్ని వివరాల కోసం విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. గీతం. ఇడు ను సంప్రదించాలని ఆయన సూచించారు.

# సమాజం నుండి డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొట్టాలి: పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**జిన్నారం, జూన్ 17:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
ప్రస్తుత సమాజాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని అరికట్టడంలో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జిన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "యువత దేశ భవిష్యత్తుకు వెన్నెముక వంటి వారు. మత్తు పదార్థాల వినియోగం యువతను పెడదోవ పట్టిస్తోంది. కళాశాల స్థాయి నుంచే డ్రగ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉంటూ, సమాజంలో వీటి నిర్మూలనకు ప్రతి విద్యార్థి సమిష్టిగా కృషి చేయాలి" అని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలను అలవర్చుకొని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు.అంతేకాకుండా, కళాశాల విద్యార్థుల విజ్ఞప్తి మేరకు.. త్వరలోనే వారికి అవసరమైన బెంచీలను అందజేస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్,



కళాశాల ప్రిన్సిపాల్ కళింగ కృష్ణ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది ప్రభుత్వ పాఠశాలలే ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

**- రెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ..**





**చేగుంట జూన్ 17 మెదక్ టుడే న్యూస్**
చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక/ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దుబ్బాక ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది ప్రభుత్వ పాఠశాలలేనని అన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలల్లోనే చేరి నాణ్యమైన విద్యను అభ్యసించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యా లను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, మౌలిక సదుపాయాలు, పరిశుభ్రమైన తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, డిజిటల్ విద్య వంటి అన్ని సౌకర్యాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం అవసరమైన సదుపాయాల కల్పనకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల బాధ్యతతో వ్యవహరించాలని, బోధనలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని సూచించారు. ప్రతి విద్యార్థి విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా కృషి చేయాలని, విద్యార్థులను క్రమశిక్షణతో పాటు విలువలతో కూడిన విద్య వైపు నడిపించాలని కోరారు.అ నంతరం విద్యార్థులకు పుస్తకాలను అందజేసి,బాగా చదివి తల్లిదండ్రులకు,పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్ప ంచ్ నర్ సింహులు, ఏఎంసీ చైర్మన్ వెంగళరావు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు సురేష్ ప్రజాప్రతిని , విద్యార్థిని విద్యార్థులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కేటీఆర్ ఆదేశాలతో చిన్నారులను పరామర్శించిన సిరిసిల్ల బీఆర్ఎస్ నాయకులు

**సిరిసిల్ల టౌన్:** పానీపూరి తిని అస్వస్థతకు గురైన చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వైద్యులకు ఆదేశించారు. ఘటన విషయం తెలుసుకున్న కేటీఆర్ వెంటనే స్థానిక బీఆర్ఎస్ నాయకులను అప్రమత్తం చేశారు. చిన్నారులను పరామర్శించి వారికి అవసరమైన మెరుగైన చికిత్స అందేలా చూడాలని ఆదేశించారు. దీంతో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాప్ స్కాబ్ ఛైర్మన్ కొండూరు రవీందర్ రావు, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ , బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చీటీ నరసింహా రావు, పట్టణాధ్యక్షుడు జిందశీ చక్రపాణి, ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. సంబంధిత అధికారులను చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై ఫోన్ ద్వారా అడిగి తెలుసు కున్నారు. అస్వస్థకు గురైన వారికి ఎటువంటి ప్రమాదం లేదని, చికిత్స అందిస్తున్నారని, త్వరలోనే కోలుకుంటారని బీఆర్ఎస్ నాయకులు తెలపడంతో



తనకు ఎంతో రిలీఫ్ ఇచ్చిందని కేటీఆర్ పేర్కొన్నారు.ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులు, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా కలుషిత నీరు, బయట దొరికే చిరుతిండ్ల విషయంలో పిల్లలు, పెద్దలు మరింత జాగ్రత్త వహించాలని ఆయన కోరారు. తంగళ్ళపల్లి మండలం కేసీఆర్‌నగర్‌లో పానీ పూరి తిని 12 మంది చిన్నారులు, ఏడుగురు పెద్దలు అస్వస్థకు గురయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే వారిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు.

# బీఆర్ఎస్‌లో చేరిన పాట్నాపూర్ సర్పంచ్
## స్వాగతం పలికిన ఎమ్మెల్యే కోవలక్ష్మి



**జైనూరు :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనురు మండలంలోని పాట్నాపూర్ సర్పంచ్ ఖందరే లక్ష్మిబాయి బాలాజీ బుధవారం ఆసిఫాబాద్‌లోని ఎమ్మెల్యే కోవలక్ష్మి ఖశీఋ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి సాధారణంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటూ తెలంగాణ అబివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న బీఆర్ఎస్ పార్టీ వైపు ప్రజా ప్రతినిధులు తిరిగి రావడం పార్టీపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని అన్నా. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల అధ్య క్షులు కొడప్ప ప్రకాష్ ,శివనూర్ సర్పంచ్ జాదవ్ శ్రావణ్, కోలాం శంకర్, మనకు గూ డా సర్పంచ్ దేవుషా, యశోదాబాయి కేశవ్, దుబ్బగూడా సర్పంచ్ మాడవి కౌశల్య, దబోలి సర్పంచ్ మెస్రం గంగాదేవి భావురావ్, మాడ వి నాగురావ్, మాజీ సర్పంచ్ మాడవి భీం రావ్ , నాయకులు ముండే సతీష్, సమాధాన్ తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రంలోనే పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య



**హైదరాబాద్ :** కాంగ్రెస్ పాలనలో రైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. అప్పులు చేసి పంటలు పండిస్తే కొనేనాథుడు లేక వర్షాలకు ధాన్యం తడిసిపోయి రైతులు అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. తాజాగా ఆదిలాబాద్ జిల్లాలో మరో రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే..ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం పొన్న గ్రామానికి చెందిన నుగూరే పాండురంగ్(48) అనే రైతు తాను పండించిన జొన్న పంటను విక్రయించేందుకు మే 23న తేదీన సిరికొండ కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లాడు. హమాలీలకు డబ్బులు చెల్లించిన అనంతరం లారీలో లోడ్ చేసేందుకు అదనంగా డబ్బులు ఇవ్వాలని కొనుగోలు కేంద్రం సిబ్బంది డిమాండ్ చేశారు. తన దగ్గర డబ్బులు లేవని చెప్పినా అధికారులు పట్టించుకోలేదని, పది రోజులైనా జొన్నలు లోడ్ చేయలేదని మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

# కెనాల్ సర్వే పనులను అడ్డుకున్న గిరిజనులు
## మహబూబాబాద్ జిల్లాలో తీవ్ర ఉద్రిక్తత



**హైదరాబాద్ :** మహబూబాబాద్ జిల్లాలో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. గార్ల మండలం దుబ్బగూడెం సమీపంలో మున్నేరు వాగు పై ప్రభుత్వం నిర్మించనున్న పాలేరు లింక్ కెనాల్ ప్రాజెక్ట్ సర్వే పనులను గిరిజనులు అడ్డుకున్నారు. తమ ప్రాంతాన్ని ఎడారిగా మార్చే పాలేరు లింక్ కెనాల్ ప్రాజెక్టు ఒప్పుకునేది లేదని, కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ బుద్దారం గిరిజనులు రోడ్డు పై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చావనైనా చస్తాము తప్ప మా భూములను వదులుకోబోమని హెచ్చరించారు. పోలీసులు ఆందోళన కారులను చెదరగొట్టేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# కోటగిరిలోని శ్రీఅయ్యప్ప, సాయిబాబా ఆలయాల్లో హుండీ చోరీ

**కోటగిరి, జూన్ 17 :** నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని శ్రీ అయ్యప్ప, సాయిబాబా దేవాలయాల్లో బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని ఇద్దరు దుండగులు ఆలయంలోకి చొరబడి రెండు హుండీలను చోరీ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. కోటగిరిలోని శ్రీ అయ్యప్ప, సాయిబాబా దేవాలయంలో బుధవారం అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ముఖానికి నల్లని ముసుగు ధరించి ఆలయంలోకి చొరబడ్డారు. దేవాలయంలోని గర్భగుడి తాళాలు పగలగొట్టి, గర్భగుడిలో ఉన్న రెండు హుండీలను తీసుకొని పరారయ్యారు. దేవాలయం పక్కనే ఉన్న కాలువలో హుండీల తాళాలు పగల కొట్టి డబ్బులను తీసుకు వెళ్లారు. హుండీలను అక్కడే కాలువలో పడేశారు. దేవాలయానికి సంబంధించిన తాళాలను వ్యవసాయ పొలాల్లో అక్కడక్కడ పడేశారు.

# తహసీల్దార్ బదిలీ సంబురాలు జరుపుకున్న బీఎస్పీ నాయకులు



**చిగురుమామిడి, జూన్ 17 :** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ముద్దసాని రమేష్ మంగళవారం బదిలీ కాగా, మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద బీఎస్పీ మండల శాఖ ఆధ్వర్యంలో పటాకులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. స్వీట్లు పంపిణీ చేసి నృత్యాలు చేశారు. చిగురుమామిడి మండల చరిత్రలోనే ఇలాంటి తహసీల్దార్ ఎప్పుడు రాలేదని అన్నారు. భూమి రిజిస్ట్రేషన్లు, ఇండ్ల పర్మిషన్లకు, నాలా కన్వెన్షన్ కు ప్రతి పనికి డబ్బులు ఇవ్వనిదే పనులు కావని, పనులను జాప్యం చేస్తూ కార్యాలయాల చుట్టూ తిప్పుకునేవాడని ఆరోపించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని అడ్డాగా చేసుకుని దొంగ పట్టాలు చేస్తున్నాడని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. ప్రజా ప్రతినిధులు సైతం వివిధ పనులపై వెళితే మీరు ఎందుకు వచ్చారు.. చిన్న చిన్న పనులకు మీరు వస్తే ఎట్లా అంటూ వ్యంగంగా మాట్లాడిన సందర్భాలు ఉన్నాయని పలువురు ఆరోపించారు. అనేక గ్రామాల్లో వ్యక్తిగతంగా ఏజెంట్లు పెట్టుకొని వారి ద్వారా డబ్బులు తీసుకొని పనులు చేసేవాడని విమర్శలు ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయంలోని సిబ్బంది కూడా విధులు సక్రమంగా నిర్వహించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో బీఎస్పీ కరీంనగర్ పార్లమెంటు ఇంచార్జ్ బోయిని బాబు, నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రాజు, చిగురుమామిడి మండల అధ్యక్షుడు ఎనగందుల శ్రావణ్ కుమార్ నాయకులు జేరిపోతుల వెంకటేష్, ములుగురి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# మొండ్రాయిలో కాంగ్రెస్ పార్టీకి షాక్
## గులాబీ గూటికి కాంగ్రెస్ నాయకులు

**వరంగల్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనను పూర్తిగా పక్కనపెట్టి పర్సంటేజీల పాలనను కొనసాగిస్తోందని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. వరంగల్ జిల్లా సంగెం మండలం మొండ్రాయి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు వడ్లకొండ శ్రీనివాస్ (వాసు) పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో హనుమకొండలోని క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు అలవికానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు వాటిని అమలు చేయడంలో చేతులెత్తేసిందన్నారు. రైతు భరోసా, రుణ మాఫీ, నిరుద్యోగ భృతి, మహిళలకు ఇచ్చిన హామీలు అన్నీ కాగితాలకే పరిమితమయ్యాయని, ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు గ్రామాల్లో తిరిగే పరిస్థితి



కూడా లేదన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన కాంగ్రెస్ నాయకులు కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమిత మయ్యారని, గ్రామాల్లో తాగునీరు, సాగునీరు, ఉపాధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు. కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి, రైతు సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పనను ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో విసిగిపోయిన నాయకులు, కార్యకర్తలు తిరిగి గులాబీ గూటికి చేరుతున్నారని తెలిపారు. పరకాల నియోజకవర్గంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నుంచి బిఆంఎస్‌లో చేరికలు మరింత పెరుగుతాయని, రాబోయే రోజుల్లో ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారన్నారు. పార్టీలో చేరిన వారిలో మడత శ్రీనివాస్, మడత శ్రీనివాస్, దామెరుప్పుల విశ్వనాథం, పరికి ఎసోబు, బొల్ల రాజు, గుర్రం సుమన్ తదితరులు ఉన్నారు.

# డాక్టర్లు లేక కాన్పు చేసిన నర్సు తల్లీబిడ్డ మృతి
## కొత్తగూడెం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో దారుణం

**కొత్తగూడెం జిల్లా:** ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం జరిగింది. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఓ నర్సు కాన్పు చేసింది. కానీ ప్రసవం అనంతరం తల్లీబిడ్డ మృతిచెందారు. వివరాల్లోకి వెళ్తే.. గుండాల మండలం శంభునిగూడెం గ్రామానికి చెందిన గర్భిణి వనజ (20)కు పురిటినొప్పులు రావడంతో గుండాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ఆ సమయంలో ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో లేరు. దీంతో అక్కడ ఉన్న నర్స్ సాధారణ ప్రసవం చేసింది. కానీ కాన్పు తర్వాత శిశువు అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఇది గమనించిన కుటుంబసభ్యులు ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నవజాత శిశువును పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్లుగా తెలిపారు. మరోవైపు కాన్పు అనంతరం తల్లికి తీవ్ర రక్తస్రావం కావడంతో




ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స పొందుతూ ఆమె కూడా మరణించింది. ఈ ఘటనపై బాధిత కుటుంబం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ కుమార్తె, మనమడు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ జ పి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# 'రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే'

**ఖమ్మం రూరల్, జూన్ 17 :** రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తిరిగి కేసీఆర్ సీఎం కావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గ పరిధిలోని ఏదులాపురం మున్సిపాలిటీ అందుగల హర్ష కన్వెన్షన్ హాల్‌లో పాలేరు నియోజకవర్గ స్థాయి పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం జరిగింది. పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ఎస్ ఐ ఆర్ ప్రక్రియ, పార్టీ సభ్యత నమోదు అంశాలపై కార్యకర్తలు, నాయకులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో గజదొంగ పాలన కొనసాగుతుంటే.. ఖమ్మం జిల్లాలో ఘరానా దొంగల పాలన కొనసాగుతుందన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా జిల్లా ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు.



దాచుకోవడం దోచుకోవడం తప్ప జిల్లా అభివృద్ధికి వారు పాటుపడిందేమి లేదని స్వార్థ ప్రయోజనాల కోసమే పాలన కొనసాగిస్తున్నారన్నారు.

**'రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే'**

'రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే' ఒక మంత్రి భూముల కబ్జాలకు పాల్పడుతుంటే, మరో మంత్రి వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టారన్నారు. ఇక ఆర్థిక మంత్రి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అస్తవ్యస్తం చేశారని విమర్శించారు. ప్రతిరోజు కేసీఆర్ అప్పులు చేశాడని మొరుగుతున్న నాయకులు ఎందుకు చేశారో బదులిచ్చారు. కేసీఆర్ చేసిన అప్పులకు రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి సజీవ సాక్షాలుగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో లక్షల కోట్లు అప్పుచేసి ఏమి అభివృద్ధి చేసిందో రాష్ట్ర ప్రజలందరూ చూస్తున్నారన్నారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి ఆలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ దందాలకు పాల్పడుతూ అనేక అక్రమాలకు ఊతమిస్తున్నారన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో దృశ్యాలను సభా వేదికపై ప్రదర్శించారు. మరికొద్ది రోజుల్లో ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో ప్రతి బిఎల్ఎ అప్రమత్తంగా ఉండాలన్నారు. అర్హత గల వ్యక్తుల ఓటర్లు తొలగించకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో దిశా నిర్దేశం చేశారు.

# పోలీస్ స్టేషన్‌కు బారీ కేడ్లు అందజేసిన యశశ్రీ హై స్కూల్ నిర్వాహకులు

**కోటగిరి, జూన్17 :** రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పోలీస్ స్టేషన్‌కు బారీ కేడ్లు అందజేయడం మంచి పరిణామని మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కోటగిరిలోని యశశ్రీ హై స్కూల్ నిర్వాహకులు రెండు బారీకేట్లు అందజేశారు. స్వచ్ఛందంగా ఇలాంటి సేవా కార్యక్రమం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్, యశశ్రీ హై స్కూల్ నిర్వాహకులు పి అనిల్




కుమార్, వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కూచి సిద్దు, వైస్ చైర్మన్ బొట్టే గజేందర్, బీర్కూర్ శ్యాంకుమార్, కప్ప సంతోష్, ప్రభాకర్ తదితరులున్నారు.

మెదక్ టుడే దిన పత్రిక

గురువారం, 18 జూన్ 2026

## బిహార్‌లో శ్రీవారి ఆలయ నిర్మాణానికి 15 ఎకరాల భూమి కేటాయింపు



**తిరుమల :** బిహార్ రాజధాని పాట్నా సమీపంలో గంగా నది తీరానికి దగ్గరగా, జాతీయ రహదారి పక్కన శ్రీవారి ఆలయ నిర్మాణం కోసం బిహం ప్రభుత్వం 15 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ సందర్భంగా టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు బిహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి జవీ ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని శాలువాతో సత్కరించి, శ్రీవారి జ్ఞాపకను అందజేశారు. ఈ సమావేశంలో బీహార్ చీఫ్ సెక్రటరీ అమృత్ ప్రత్యయ్ పాల్గొన్నారు. ప్రతిపాదిత ఆలయ ప్రాంగణంలో ప్రధాన దేవాలయంతో పాటు కళ్యాణ మండపం, పుష్కరిణి, యాత్రికుల సౌకర్యాలకు అవసరమైన ఇతర మౌలిక వసతులను ఏర్పాటు చేయనున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణం ద్వారా సనాతన ధర్మ ప్రచారాన్ని విస్తరించాలనే లక్ష్యంతో టీటీడీ ముందుకు సాగుతోందని చైర్మన్ వెల్లడించారు.

ఈ క్రమంలో అన్ని రాష్ట్ర రాజ ధానుల్లో శ్రీవారి ఆలయాలను ఏర్పాటు చేయాలనే సంకల్పంతో కార్యాచరణ కొన సాగుతోందని తెలిపారు. ఇప్పటికే అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో శ్రీవారి ఆలయ నిర్మాణం కోసం 10 ఎకరాల భూమి కేటా యింపు పూర్తి అయ్యిందని తెలిపారు. ఉత్తర భారత భకు_్తలకు తిరుమల శ్రీవారితో అను బంధాన్ని మరింత పెంచడంతో పాటు, ఈ ఆలయం భవిష్యత్తులో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు టీటీడీ ప్రణాళికలు రూపొందిస్తోందని వెల్లడించారు.

## తిరుమలను దర్శించుకున్న కాశీ మఠం సంస్థానం పీఠాధిపతి



**తిరుమల :** వారణాసిలోని కాశీ మఠం సంస్థానం పీఠాధిపతి సంయమీంద్ర తీర్థ స్వామీజీ బుధవారం తిరుమల శ్రీవారి ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు తిరుమల అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, గర్భాలయం వరకు తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీతిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 25 కంపార్టుమెంట్లు నిండిపోయాయి. టోకెన్లు లేని భకు_్తలకు 12 నుంచి 15 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు వెల్లడించారు.

నిన్న స్వామి వారిని 86,601 మంది భక్తులు దర్శించు కోగా 31,111 మంది తల నీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల హుండీకి రూ. 4.72 కోట్లు ఆదాయం వచ్చిందని వివరించారు. 4.32 లక్షల లడ్డూలు విక్రయించామని తెలిపారు.

## అమరావతికి ట్రాఫిక్ ఫ్రీ జర్నీ నాలుగు లైన్లతో కొత్త ఆర్వోబీ ఎన్నో ఏళ్ల సమస్యకు తెర



**గుంటూరు :** గుంటూరు జిల్లా నిడమర్రు రైల్వే లెవల్ క్రాసింగ్ వల్ల మంగళగిరి నుంచి అమరావతి, తాడికొండ వైపు రాకపోకలు కొనసాగించేవారికి ఇబ్బందులు ఎదురయ్యాయి. వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురయ్యేవి. అక్కడ తరచూ గేటు మూయడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రద్దీ సమయంలో వాహన రాకపోకలు ఆగిపోవడంతో పాటుగా ప్రయాణ సమయం పెరగడం, అత్యవసర సేవలకు అంతరాయం ఎదురైంది. అలాగే మంగళగిరి దగ్గర ఉన్న క్రికెట్ స్టేడియానికి వెళ్లవారికి ఇబ్బందులు తప్పలేదు. ఈ విషయం మంత్రి లోకేష్‌కు తెలియడంతో ఆయన చొరవ తీసుకుని ఆర్వోబీ కోసం రైల్వే అధికారులకు రిక్వెస్ట్ చేయడంతో మంజూరు చేశారు. ఈ ఆర్వోబీ పూర్తయితే అమరావతి, తాడికొండ, మంగళగిరి, నిడమర్రు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తొలగిపోతాయి. మంగళగిరి నుంచి నిడమర్రు, బేతపూడి, నీరుకొండ, కురగల్లు గ్రామాల ప్రజలకు ప్రమాయణ సమయం తగ్గుతుందని చెబుతున్నారు. నిడమర్రు ఆర్వోబీ 10 మీటర్ల ఎత్తు, 767.50 మీటర్ల పొడవు, 28 మీటర్ల వెడల్పుతో నాలుగు లైన్లుగా నిర్మించనున్నారు. రైల్వే లైన్ నుంచి మంగళగిరి వైపు 405.50 మీటర్లు, అమరాతి వైపు 362 మీటర్లు నిర్మాణం చేపట్టనున్నారు. ఆర్వోబీ నాలుగు లైన్లుగా.. ప్రతి లైను 3.75 మీటర్లు.. గ్యారేజ్ వెడల్పు 15 మీటర్లు ఉంటుంది. 0.45 మీట ర్లు చొప్పున రెండు వైపులా క్రాస్ బ్యారియర్లు, 0.45 మీటర్లు మధ్య డివైడర్ నిర్మించనున్నారు. సర్వీసు రోడ్డు డ్రైన్లతో కలిపి రెండు వైపులా 11 మీటర్లు(5.5ఇ2) 5.5 మీటర్ల వెడల్పు ఉంటుంది.

రోడ్లతో కలిపి మొత్తం వంతెన వెడల్పు 28 మీటర్లు ఉంటుంది. నిడ మర్రు ఆర్వోబీకి శంకుస్థాపన చేయడం

## యువకుడు మిస్సింగ్‌పై అనుమానాలు విజయవాడ పోలీసులపై అంబటి రాంబాబు సంచలన ఆరోపణలు



**అమరావతి :** విజయవాడ కృష్ణలంకకి చెందిన గాదె సాయికృష్ణ కనిపించకుండా పోవడంపై వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులపై సంచలన ఆరోపణలు చేశారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. సాయికృష్ణను పోలీస్‌స్టేషన్‌లో హత్య చేసి ఆనవాళ్లు లేకుండా దహనం చేశారని పేర్కొన్నారు. కనీసం బూడిద లేకుండా మాయం చేశారని వెల్లడించారుసాయికృష్ణ మేనమామ నవరంగ్ జనసేన కార్యకర్త అని వివరించారు. అయితే తన మేనల్లుడు కనపించకపోవడంతో తనను సంప్రదించారని అన్నారు. సాయికృష్ణపై వస్తున్న అనుమానాలను జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాజకీయాలకు అతీతంగా స్పందించలని కోరారు. దేశంలో ఎన్నో లాకప్ డెత్‌లు జరిగాయి. కానీ విజయవాడలో సాయికృష్ణను లాకప్‌డెత్ చేసి శవాన్ని మాయం చేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో హెబియస్ కార్పస్ కేసు వేస్తే యువకుడి కోసం వెతుకుతున్నామని పోలీసులు దాటేవేసే ధోరణిని కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. సాయికృష్ణను లాకప్‌డెత్ చేశారు. సీబీఐ విచారణ వేసి న్యాయం చేయాలని, సాయికృష్ణను దహనం చేసి ఉంటే కనీసం బూడిదనైనా ఇవ్వమని సాయికృష్ణ తల్లి చేస్తున్న విజ్ఞప్తిని పట్టించుకోవాలని కోరారు. బాధ్యులైన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాయికృష్ణపై ఏమైనా కేసులుంటే చట్టపరంగా శిక్షించాలని, చంపే హక్కు ఎవరిచ్చారని మేనమామ నవరంగ్ పోలీసులను ప్రశ్నించారు.

## ఏపీలో బీచ్ షాక్స్ సముద్ర తీరంలో ఛిల్ కావొచ్చు జీవో జారీ

**ఆంధ్రప్రదేశ్ :** ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో బీచ్ షాక్స్ ఏర్పాటు చేయాలని సంకల్పించింది. ఈ అంశంపై ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో చర్చ జరిగిన సంగతి తెలిసిందే. తాజాగా రాష్ట్రంలో బీచ్ షాక్స్ ఏర్పాటుకు సంబంధించిన జీవోను ఏపీ ఎక్సైజ్ శాఖ విడుదల చేసింది. ఈ మేరకు బుధవారం రోజు జీవో నంబర్ 362ను అధికారులు విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ 12 జిల్లాల్లో గుర్తించిన ప్రాంతాలలో బీచ్ షాక్స్ ఏర్పాటుకు గైడ్ లైన్స్ రూపొందించారు. బొంగులు వంటి వాటితో ఏర్పాటు చేస్తారు. సముద్రపు అందాలను ఆస్వాదిస్తూ సేద తీరేందుకు బీచ్ బెడ్‌లుంటాయి. అలాగే బీచ్ బెడ్ల వద్ద నుంచే మనకు కావాల్సిన ఆహారాన్ని ఆర్డర్ చేసుకోవచ్చు. బీచ్ షాక్స్‌లలో బీర్లు, వైన్లు, జ్యూస్‌లు, సీఫుడ్, ప్రాంతీయ వంటకాలు, కాక్‌టెయిల్, డ్రింక్స్, స్నాక్స్ వంటివి అందుబాటులో ఉంచుతారు. అలాగే షవర్, వాష్ రూమ్స్ వంటి సౌకర్యాలు




కూడా కల్పిస్తారు. అయితే బీచ్ షాక్స్‌లో విదేశీ మద్యం, ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ విక్రయాలకు ఏపీ ఎక్సైజ్ శాఖ అనుమతి ఇవ్వలేదు. మరోవైపు మన దేశంలో గోవా వంటి చోట్ల బీచ్ షాక్స్ చాలా ఫేమస్. మన దగ్గర కూడా ఇలాంటి వాటిని ఏర్పాటు చేయటం ద్వారా మరింత మంది పర్యాటకులకు బీచ్‌ల వద్దకు ఆకర్షించవచ్చని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో సముద్ర తీరాలలో సరదాగా ఛిల్ అవుదామని భావించే చాలా మందికి ఇది శుభవార్తే అని చెప్పొచ్చు. ఇలాంటి అనుభూతుల కోసం గోవా వంటి ప్రాంతాలకు వెళ్లే పనిలేకుండా త్వరలో ఏపీలోనే బీచ్ షాక్స్ మనం చూడొచ్చు.

## ఏపీలోని ఆ జిల్లా రైతులకు శుభవార్త కీలక ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ మారనున్న 4 మండలాల రూపురేఖలు




**పల్నాడు జిల్లా:** పల్నాడు జిల్లా రైతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీపికబురు వినిపించింది. పల్నాడు మెట్ట ప్రాంతాల ప్రజల సాగునీటి కల సాకారం చేసే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. పల్నాడు రైతులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వరికపూడిశెల ప్రాజెక్ట పైప్‌లైన్ నెట్‌వర్క్ పనులను వేగవంతం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా ప్రాజెక్ట పరిధిలోని భూసేకరణ పనుల కోసం రూ. 63.14 కోట్లు నిధులను కేటాయించింది. వీలైనంత త్వరగా భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని.. క్షేత్రస్థాయిలో పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించింది. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే మాచర్ల నియోజకవర్గంలోని వెల్దుర్తి, దుర్గి, మాచర్ల, కారంపూడి మండలాల రూపురేఖలు మారనున్నాయి. పైప్‌లైన్ ద్వారా సాగునీటి సరఫరా జరగనుంది. ఈ నేపథ్యంలో వరికపూడిశెల ప్రాజెక్టును నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ట్వీట్ చేశారు. రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్న ఆయన.. పల్నాడు జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించే వరకు విశ్రమించమని స్పష్టం చేశారు. పల్నాడు రైతుల కల అయిన వరికపూడిశెల ప్రాజెక్టును నిర్దేశిత సమయంలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఏంటీ వరికపూడిశెల ప్రాజెక్టు..

మరోవైపు వరికపూడిశెల ప్రాజెక్టు పల్నాడు ప్రజలను దశాబ్దాల నుంచి ఊరిస్తోంది. ఈ ప్రాజెక్టులో భాగంగా నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్ నుంచి పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలంలోని గంగలకుంట సమీపంలో ఉన్న వరికపూడి వాగు వద్దకు నీటిని ఎత్తిపోస్తారు. అక్కడి నుంచి పొలాలకు నీరు అందిస్తారు. ప్రాజెక్టులో భాగంగా అడవిలో పైప్ లైన్ నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టుకు ఇటీవలే టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్(టీవోఆర్) అనుమతులు కూడా మంజూరయ్యాయి. ప్రాజెక్టు పూర్తి అయితే మాచర్ల, కారంపూడి, వెల్దుర్తి, దుర్గి మండలాల్లోని 84,500 ఎకరాలకు సాగునీరు అందుతుంది. అలాగే నియోజకవర్గంలోని 25 గ్రామాల పరిధిలో ఉన్న 20 వేల మంది దాహార్తి తీరనుంది. మరోవైపు వరికపూడిశెల ప్రాజెక్టుకు సుమారుగా రూ.3227.15 కోట్లు అవుతుందని అంచనా. అలాగే ఈ ప్రాజెక్టు నిర్మాణానికి 270.5 హెక్టార్ల మేరకు భూమి అవసరం. అటవీ భూమినే 19.13 హెక్టార్ల మేరకు సేకరించాల్సి ఉంది.

## అరేయ్ బాబూ లోకేషూ జగన్ ఎందుకు నేను చాలు లక్ష్మీపార్వతి సవాల్

ఏపీలో ప్రస్తుతం సవాళ్ల పర్వం నడుస్తోంది. డీఎస్సీపై చర్చకు రావాలని వైఎస్ జగన్‌కు నారా లోకేష్ ఛాలెంజ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వైసీపీ మహిళా నేతలు నారా లోకేష్‌కు సవాల్ విసిరారు. నారా లోకేష్‌తో చర్చకు తమ నాయకుడు అవసరం లేదని.. తాముచాలంటూ లక్ష్మీపార్వతి , శ్యామలతో పాటుగా వైసీపీ మహిళా నేతలు తాడేపల్లి భరతమాత విగ్రహం వద్ద నుంచి సవాల్ విసిరారు. డీఎస్సీలో అక్రమాలను ఆధారాలతో సహా బయటపెడతామని.. దమ్ముంటే చర్చకు రావాలని ఛాలెంజ్ చేశారు. "అరేయ్ బాబూ లోకేష్. నీ మాటలు వింటే నవ్వొస్తోందిరా. ఇక్కడికి వచ్చి జగన్ మీద సవాల్ విసిరి వెళ్లిపోయావ్. మహిళలను జగన్ అవమానించారా.. భారతి, వారి పిల్లలు సమాధానం చెప్పాలా మహిళల మీద మీరు చేస్తున్న ట్రోలింగ్‌కు మేమంతా బాధితులమే. మా మీద, భారతి మీద చేసిన ట్రోలింగ్ గురించి ముందు మాట్లాడు.. తండ్రిని అడ్డుపెట్టుకుని ఇష్టానుసారం ప్రవర్తిస్తున్నావ్. మీ హోం మంత్రిని ఏదో అన్నారని అంటున్నావ్. మీ హోం మంత్రి ఏ ఒక్క కేసు అయినా పట్టించుకుంటున్నారా.. ఎప్పుడూ లేని విధంగా రాష్ట్రంలో మహిళలపై దాడులు, అఘాయిత్యాలు జరుగుతున్నాయి. హోం మంత్రి ఏనాడైనా పట్టించుకున్నారా దోషులను శిక్షించారా మీరు జగన్‌కు నీతులు చెప్తున్నారా అని లక్ష్మీపార్వతి ప్రశ్నించారు.

## ఏపీ ఫుడ్ కమిషన్ ఛైర్మన్ హైకోర్టులో ఊరట

### హోంశాఖ, పోలీసుల అప్పీల్‌కు నో చెప్పిన ధర్మాసనం




**ఆంధ్రప్రదేశ్:** ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డికి భద్రతపై హైకోర్టులో మరోసారి విచారణ జరిగింది. గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై హోంశాఖ అప్పీల్ చేయగా ధర్మాసనం నిరాకరించింది. గత ప్రభుత్వ హయాంలో ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డికి 1o1 గన్‌మెన్‌లతో భద్రతను కల్పించగా.. కూటమి ప్రభుత్వం తొలగించారు. దీంతో విజయ్ ప్రతాప్ హైకోర్టును ఆశ్రయించారు. తనకు ముందస్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వకు ండా భద్రతను తొలగించారని కోర్టుకు తెలిపారు. తాను ఫుడ్ కమిషన్ ఛైర్మన్ హోదాలో రాష్ట్రమంతా పర్యటిస్తానని.. కాబట్టి తనకు గతంలో ఉన్న 1o1 భద్రతను పునరుద్ధరించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. ఏపీ హైకోర్టు సింగిల్ జడ్జి విజయ్ ప్రతాప్ పిటిషన్‌పై విచారణ జరిపారు. పిటిషనర్ చట్టబద్ధ విధులు నిర్వహిస్తున్నారని.. భద్రతను పునరు ద్ధరించాలని ఫిబ్రవరిలో ఆదేశించారు. ఈ తీర్పును హోం శాఖ, పోలీసు ఉన్నతాధికారులు ఏపీ హైకోర్టు ధర్మాసనం ముందు అప్పీల్ చేశారు. విజయ్ ప్రతాప్ రెడ్డికి ఎలాంటి ప్రాణహాని లేదని.. అందుకే ఆయనకు ఉన్న భద్రతను తొలగించామని ప్రభుత్వ తరఫు లాయర్ కోర్టులో వాదనలు వినిపించారు. ఆయన కూడా తనకు ప్రాణహాని ఉందని హైకోర్టుకు, సెక్యూరిటీ రివ్యూ కమిటీకి ఎలాంటి ఆధారాలు ఇవ్వలేదన్నారు. సింగిల్ జడ్జి తీర్పు అమలును నిలిపివేయాలని కోరారు.

## రిటైర్డ్ ప్రిన్సిపల్‌పై ఏపీ ప్రభుత్వం చర్యలు పెన్షన్ గ్రాట్యుటీ నిలిపివేత భారీగా జరిమానా

**నెల్లూరు:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డిగ్రీ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకుంది. యూజీసీ నిధుల నిధుల దుర్వినియోగం చేసిన వ్యవహారంలో విద్యాశాఖ భారీగా జరిమానా విధించింది. ఆయన పెన్షన్ గ్యాట్యుటీని కూడా నిలిపివేసింది. నెల్లూరు జిల్లా ఉదయగిరి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్‌గా డి వెంకటేశ్వరరావు పనిచేశారు. ఆయన 2009 డిసెంబరు నుంచి 2010 నవంబరు వరకు ప్రిన్సిపల్‌గా విధుల్లో ఉన్నారు. వెంకటేశ్వరరావు ప్రిన్సిపల్‌గా ఉన్న సమయంలో రూ.26.77 లక్షల మేర యూజీసీ నిధుల దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వచ్చాయి. ఈ నిధుల అంశంపై వెంకటేశ్వరరావు వివరణ కూడా ఇచ్చారు.. విద్యాశాఖ ఆయన వివరణ సంతృప్తికరంగా లేదని విచారణాధికారిని కూడా నియమించింది. వెంకటేశ్వరరావుపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి నిజమేనని తేల్చారు. ఆయన్ను సర్వీస్ నుంచి డిస్మిస్ చేసి జరిమానా విధించాలని ప్రభుత్వానికి సిఫార్సు అందింది. వెంకటేశ్వరరావును ఉద్యోగం నుంచి తొలగించి.. రూ.16.80 లక్షల్ని రికవరీ చేయాలని 2017లో ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినా అమలు చేయలేదు. 2017 జులై నెలలో ఆయన రిటైర్ కావడంతో ఆయనపై చర్యలు ఎందుకు తీసుకోలేదో వివరణ ఇవ్వాలని ప్రభుత్వం అధికారుల్ని ఆదేశించింది. వెంకటేశ్వరరావు దుర్వినియోగం చేసిన డబ్బులు రూ.26.77 లక్షల్ని రికవరీ చేసి యూజీసీకి చెల్లించారు. అలాగే ఆ డబ్బులు 2024 మార్చి నాటికి 4.7శాతం రేటుతో వడ్డీ కింద లెక్కించి రూ.10.19 లక్షలు వసూలు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. యూజీసీ నిధుల్ని దుర్వినియోగం చేసినందుకు వడ్డీ ఎందుకు వసూలు చేయకూడదో చెప్పాలంటూ వెంకటేశ్వరరావుకు షోకాజు నోటీసులు జారీ చేశారు. ఆయన వివరణ ఇవ్వగా ప్రభుత్వం సంతృప్తి చెందలేదు.. ఆయన దగ్గర నుంచి రూ.10.19 లక్షలు వసూలు చేయడంతో పాటుగా శాశ్వతంగా పెన్షన్, గ్రాట్యుటీ నిలిపివేయాలని ఆదేశించింది. తాజాగా ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. చాలా అరుదగా ప్రభుత్వ ఉద్యోగులపై ఇంత భారీగా జరిమానా విధిస్తుంటారని చెబుతున్నారు. ఏపీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చర్చనీయాంశంగా మారింది.. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేసేవారికి ఇదొక హెచ్చరికనే చర్చ జరుగుతోంది.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..